ప్రజాశక్తి

సోమవారం 29 జులై 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సవాలక్ష మోసాలు.. సిఐడి మీనమేషాలు

- హయగ్రీవ ఎమ్‌డి జగదీశ్వరుడి అక్రమ చిట్టాపై నగరంలో చర్చ
- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన నేపథ్యంలో కోర్టుల్లో 97 కేసులు
- 2015లో సీజ్ చేసిన ప్రాపర్టీపై రూ.3.67 కోట్లు బ్యాంకు రుణం
- కూటమి ప్రభుత్వం స్పందించేనా..?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రభుత్వ, వుడా భూముల ట్యాంపరింగ్... బ్యాంకులను మోసగించడం... ఆఖరికి సిఐడి అధికారులు జప్తు చేసిన ప్రాపర్టీపైనే బ్యాంకు రుణాలు సంపాదించి నేర పరిశోధన సంస్థ కళ్లు కప్పడం.. ఇలా ఒకటేంటి ? సవాలక్ష మోసాలకు హయగ్రీవ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి జగదీశ్వరుడు పాల్పడినా ఆయనపై చర్యలు లేకపోవడం చర్చనీయాంశమవుతోంది. ఏకంగా ఆయనపై కోర్టుల్లో 97 కేసులున్నాయి. ఏ ఒక్క కేసులోనూ అరెస్టయిన దాఖలా లేకపోవడం.. ప్రభుత్వాల కళ్ళు కప్పుతూ తప్పించుకు తిరగడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది.

జగదీశ్వరుడు గతంలో వుడా నుంచి 12 ఎకరాలను హయగ్రీవ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్టు పేరుతో వృద్ధుల ఆశ్రమం కోసం తీసుకున్నారు. అయితే ఆ భూమి వేరొకరిదన్న వాదనా ఉంది. భూములను ట్యాంపరింగ్ చేశారని, నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్‌లు చేసి నిధులు కాజేశారని ఉన్న అభియోగాలపై కేసు ఇప్పటికీ నడుస్తోంది. పైపెచ్చు సదరు స్థలంలో ఎటువంటి ఆశ్రమ నిర్మాణాలూ చేపట్టలేదు. మరోవైపు విశాఖ నగరంలోని ఎంవిపి.కాలనీ సెక్టార్-2లో సర్వే నెంబరు 5/పి, 6/పిలో నిర్మాణంలో ఉన్న 3126 చదరపు గజాల భవనాన్ని 2015 ఆగస్టు 11న జిఒ 124 ప్రకారం.. సిఐడి స్వాధీనం చేసుకుంది. 2015లో సీజ్ చేస్తే 2020 సెప్టెంబర్‌లో యూనియన్ బ్యాంకును మోసగించి



సిఐడి ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు (ఫైల్ ఫొటో)

జగదీశ్వరుడు (ఫైల్‌ఫొటో)

జగదీశ్వరుడు రూ.3.67 కోట్లు రుణం తీసుకున్నారు. తాను జప్తు చేసిన భవనానికి హెచ్చరిక బోర్డును సైతం సిఐడి అప్పట్లో పెట్టింది. దీనిపై అమ్మకాలు, కొనుగోళ్లను నిషేధిస్తున్నట్లు నోటీసులో పేర్కొంది. అయినప్పటికీ దీన్ని సైతం బ్యాంకులో పెట్టి అక్రమంగా పైన తెలిపిన రూ.3.67 కోట్లు రుణం జగదీశ్వరుడు పొందారు. ఈ వ్యవహారంలోనూ మిగతా 2లో..

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- మౌలిక సదుపాయాలు ఉంటేనే కళాశాలలకు అనుమతులు
- వృత్తి విద్యా కోర్సులతో విస్తృత ఉపాధి అవకాశాలు
- 'ప్రజాశక్తి'తో ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి మురళీధర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

నిబంధనలు అతిక్రమించి నడిచే కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.మురళీధర్ అన్నారు. ఇప్పటికే విశాఖ నగరంలో ఫిర్యాదులు అందిన విద్యాసంస్థలకు నోటీసులు జారీ చేశామన్నారు. ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాలు కొన్ని విద్యా సంస్థలు నిబంధనలు పాటించడం లేదని తమ దృష్టికి తెస్తున్నాయని, త్వరలోనే అటువంటి కళాశాలలపై దాడులు నిర్వహించి వ్యవస్థను గాడిలో పెడతామని అన్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో విశాఖలో మెరుగైన ఉత్తీర్ణతా శాతం నమోదవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ముమ్ముందూ మంచి ఫలితాలు సాధిస్తామని చెప్పారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన పలు విషయాలపై ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

విశాఖపట్నం జిల్లా పరిధిలో ఎన్ని ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి?

విశాఖపట్నం జిల్లా పరిధిలో కళాశాలలు 172 ఉన్నాయి. వీటి ద్వారా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 38,818 మంది విద్యార్థులు హాజరు కాగా 30,050 మంది ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షకు 34,672 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 29,258 మంది ఉత్తీర్ణత సాధించారు.

కళాశాలల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయి ?

ఇంటర్మీడియట్ కళాశాలన్నింటిలోనూ మౌలిక వసతులు 100 శాతం మెరుగ్గా ఉన్నాయి. ప్రైవేటు కళాశాలలు ఏవైతే వంద శాతం మౌలిక సదుపాయాలు సమకూర్చుతాయో వాటికి మాత్రమే అనుమతులు ఇస్తున్నాం. వాటిపై ఎప్పటికప్పుడు తనిఖీలు మిగతా 2లో..

నిలిచిన గృహ నిర్మాణాలు

వార్త 8లో..

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు మంచి నిర్ణయం

వార్త 8లో..

అగనంపూడి టోల్‌గేట్‌ను శాశ్వతంగా ఎత్తివేయాలి

వార్త 4లో..

పోటాపోటీగా సాగుతున్న చదరంగం పోటీలు

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రపంచ చదరంగం దినోత్సవం సందర్భంగా ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. అవి ఎంతో ఉత్సాహంగా సాగాయి. ఐసి ఆఫ్ విసిసి మూడు సంవత్సరాలుగా ఈ పోటీలను క్లబ్, జిల్లా స్థాయిలో నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా పోటీలను వివిధ స్థాయిల్లో నిర్వహించింది. ఆదివారం తలపెట్టిన పోటీలను రోటేరియన్ మిగతా 2లో..

రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్

విశాఖలో సిఐటియు, ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన బడ్జెట్ ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రైతులకు, కార్మికులకు ద్రోహం చేసేదిగా ఉందంటూ ఆదివారం జగదాంబ జంక్షన్‌లో సిఐటియు, ఎపి రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.నాయనబాబు మాట్లాడుతూ గ్రామీణ పేదలను, కార్మికులను ద్రోహం చేసే విధంగా కేంద్ర బిజెపి బడ్జెట్ ఉందని విమర్శించారు. వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలకు మోడీ ప్రభుత్వం మరోసారి అన్యాయం చేసిందన్నారు. గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో కోత విధించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. వికసిత భారత్ అంటే పేదలకిచ్చే సబ్సిడీలకు, బడ్జెట్‌లో నిధులకు కోత

బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న సిఐటియు, రైతు సంఘం నాయకులు

విధించి కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పించడం కాదని మోడీ ప్రభుత్వానికి చురకలంటించారు. 2024 సాధారణ ఎన్నికల్లో రైతులు, గ్రామీణ పేదలు, కార్మికులు బుద్ధిచెప్పినప్పటికీ మోడీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్

సిగ్గుచేటు అన్నారు. బిజెపియేతర రాష్ట్రాలకే కాకుండా ఎన్‌డిఎ కూటమిలో ఉన్న రాష్ట్రాలకు సైతం తీవ్ర కోతలు విధించారన్నారు. మూడేళ్లుగా వరుసుగా వ్యవసాయ అనుబంధ రంగాలకు కేంద్రం కోతలు పెడుతోందని, 2022-23 కన్నా ఈ బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీకి 35 శాతం, ఆహార సబ్సిడీలో 25 శాతం, ఉపాధి హామీ పథకానికి 20 శాతం కోతలు విధించడాన్ని దుయ్యబట్టారు. తక్షణమే ఈ బడ్జెట్‌ను రివైజ్ చేసి రూ.5 వేల కోట్లు కేటాయించాలన్నారు. వర్షాలు కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించాలన్నారు. సోమనాథన్ సిఫార్సుల అమలుకు ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడం దారుణమన్నారు. కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, చిన్న, సన్నకార రైతులను ఆదుకొనేలా బడ్జెట్ ఉండాలి తప్ప కార్పొరేట్లకు ఊడిగం చేసే విధంగా ఉండకూడదన్నారు. కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్‌కోడ్స్‌ను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటన చేయాలని, సొంత గనులను కేటాయించడంతోపాటు వర్కింగ్ క్యాపిటల్‌కు రూ.5 వేల కోట్లు తక్షణ సాయంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్మిక సంఘ నాయకులు రాజు, ఎ.సీతాలక్ష్మి, పి.మణి, చంద్రశేఖర్, పి.వెంకటరావు, ఒమ్మి అప్పారావు, చంద్రమౌళి, నరేంద్ర కుమార్, దేముడు నాయుడు, గనిశెట్టి సత్యన్నారాయణ, ఎం.రాంబాబు, పి.పైడిరాజు, ఆర్.లక్ష్మణమూర్తి, డి.కొండమ్మ, భారతి, శంకరరావు, బాబూరావు పాల్గొన్నారు.

సవాలక్ష మోసాలు.. సిఐడి మీనమేషాలు

ఆయనపై కేసు నమోదైంది. ఇలా ఒకే దెబ్బకు అటు యూనియన్ బ్యాంకును, ఇటు సిఐడిని ఆయన మోసగించడం గమనార్హం. ఇదిలా ఉండగా కేసులు నమోదు చేసి సిఐడి కాలక్షేపం చేస్తుందే తప్ప ఆయనపై చర్యలకు దిగడం లేదన్న విమర్శలు బాధితుల నుంచి వినిపిస్తున్నాయి.

మోసపోయిన వారంతా ఒక్కటై..

భీమిలి మండలం చిప్పాడ గ్రామంలో సర్వే నెంబరు 160/1లో ఎ.శ్రీనివాసరావు, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన 4.61 ఎకరాలకు సైతం దొంగ డాక్యుమెంట్లు సృష్టించి హయగ్రీవా పేరుతో జగదీశ్వరుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇలా ఆయన చేతిలో ఆర్థికంగా చితికిపోయిన వారంతా సిఐడి ఎడిజికి రాతపూర్వకంగా ఇటీవల ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ సంస్థలను మోసం చేస్తూ తప్పించుకు తిరిగే జగదీశ్వరునిపై సిఐడి ఇంకా మీనమేషాలు లెక్కించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం ఆయన ఘరానా మోసాలపై స్పందించాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

నిర్వహిస్తున్నాం.

వృత్తి విద్యా కోర్సులు చదివే వారికి ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయి ?

ఇంటర్మీడియట్ అనంతరం ఎక్కువమంది ఎంసెట్, నీట్ పరీక్షలకు హాజరవుతుంటారు. వారు కాకుండా ఇంటర్ ఒకేషనల్ కోర్సులు ఎంచుకున్న సిఎస్‌సి, ఇటి, ఎమ్ఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు విద్యార్థులు ఆ కోర్సులు పూర్తయిన వెంటనే ఉద్యోగాల్లో చేరవచ్చు. ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఉపాధి కేంద్రం ద్వారా ఉద్యోగాలు పొందేందుకు సహకరిస్తోంది.

ప్రైవేటు కళాశాలలకు ఉన్న పరిమితులు ఏంటి ?

ఇంటర్మీడియట్ బోర్డ్ పరిధిలోని ప్రైవేట్ కళాశాలల్లో విశాలమైన తరగతి గదులు ఉండాలి. గదికి 40 మంది విద్యార్థులు మాత్రమే ఉండాలి. నిపుణులైన అధ్యాపకులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, టాయిలెట్లు, సైన్స్ తరగతులు నిర్వహించే కళాశాలల్లో ల్యాబ్‌లు, ఒకేషనల్ గ్రూపులు నిర్వహించే కళాశాలల్లో టెక్నికల్ ల్యాబ్‌లు కచ్చితంగా ఉండాలి.

ఈ ఏడాది నూతనంగా చేపట్టిన కార్యక్రమాలేంటి ?

ఈ ఏడాది నూతనంగా సప్లమెంటరీ పరీక్షలకు మూల్యాంకనాన్ని ఆన్‌లైన్ విధానం ద్వారా చేపడుతున్నాం. అందుకోసం విశాఖ కేంద్రంగా రెండు లక్షల పైచిలుకు జవాబు పత్రాలను స్కాన్ చేసి మూల్యాంకనం కోసం సిద్ధం చేశాం. ఈ ప్రక్రియలో స్కాన్ చేసిన జవాబు పత్రాలను ప్రభుత్వం ద్వారా నియమించబడ్డ ఉపాధ్యాయులకు పంపుతున్నాం. వాటిని వారు ఆన్‌లైన్‌లోనే కరెక్షన్ చేసి మార్కులు వేసే విధానం ఈసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

సెలవు దినాల్లో తరగతులు నిర్వహించే వారిపై చర్యలు ఏమైనా తీసుకుంటారా ?

ప్రభుత్వం నిర్ణయించిన సెలవు దినాల్లో తరగతులు నిర్వహించే కళాశాలలపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

వై.మోదాంబిక (డిస్ట్రిక్ట్ బేసిక్ ఎడ్యుకేషన్) ప్రారంభించారు. ఈ పోటీలను సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ కేటగిరీల్లో నిర్వహించారు. 120 మంది పాల్గొన్నారు. ప్రతి కేటగిరీలో ఐదు బహుమతులు అందజేశారు. క్లబ్ స్థాయిలో గెలిచిన వారికి కూడా బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా రొటేరియన్ టి.వినయ్ గాంధీ (ప్రెసిడెంట్, రోటరీ క్లబ్ విశాఖపట్నం) రోటేరియన్ మణిమాల (సెక్రటరీ), పాస్ట్ ప్రెసిడెంట్ పి.జగన్ మోహన్ హాజరై బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విసిసి పిల్లల కోసం నిరంతరం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగిన విషయమన్నారు. చెస్ ఆడటం వల్ల పిల్లలలో ఏకాగ్రత, లాజిక్, చురుకుదనం పెరుగుతాయన్నారు. పోటీలో పాల్గొన్నవారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో భీమిలి, మధురవాడ, జగదాంబ, మద్దిలపాలెం, గాజువాక, కంచరపాలెం, ఆరిలోవ, గంట్యాడ నుంచి పలువురు పాల్గొన్నారు. ఎల్ఐసి ఉద్యోగి, చెస్ కోచ్ చాగంటి శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. విసిసి ప్రెసిడెంట్ ఎస్.హరిత, జోన్ కన్వీనర్లు యల్లాజీ, అప్పారావు, కృష్ణారావు, స్వర్ణలత, ఆర్గనైజర్లు మణి, కల్యాణి, సరోజిని, భవాని, జాహ్నవి, సాయి, ఆర్.నిఖిల్, గుణశంకర్, శశి, సూర్య, అజయ్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

అవగాహనా ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కాలేయ వ్యాధి పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన శైలి ద్వారా ఆ వ్యాధిని అదుపులో ఉంచవచ్చని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా ఆదివారం ఆర్కే బీచ్‌లోని కాళీమాత టెంపుల్ వద్ద ఆంధ్ర మెడికల్ కాలేజ్, కెజిహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, మైక్రోబయాలజీ డిపార్టుమెంట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాళీమాత టెంపుల్ నుంచి పోలీసు అమరవీరుల స్థూపం వరకు ఈ హెపటైటిస్ డే అవగాహనా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమంగా హెపటైటిస్ బి, సి వ్యాధుల ప్రమాదం పెరుగుతోందని, దీన్ని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం కొన్ని కోట్ల మంది కాలేయ ఇన్ఫెక్షన్‌తో చనిపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా పిల్లలకు హెపటైటిస్ బి వ్యాక్సిన్‌ను పుట్టిన 24 గంటలలోగా తప్పకుండా వేయించాలన్నారు. మద్యపానం సేవించేవారు అధికంగా ఈ కాలేయ వ్యాధికి గురవుతున్నారని తెలిపారు. వ్యాధి సంక్రమణ పద్ధతులను వివరించారు. ఎఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ రక్షణ లేని సిరంజీలు, డ్రగ్స్ వినియోగించే వారిలోనూ ఈ వ్యాధి ప్రబలుతోందన్నారు. అనంతరం కలెక్టర్ ఉచిత కాలేయ పరీక్షల మెడికల్ క్యాంపును ప్రధాన వైద్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ సీనియర్ వైద్యులు పెద వీర్రాజు, కెజిహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి గిరినాధ్ పాల్గొన్నారు.

చిన్నోడికి ప్రేమతో పుస్తకావిష్కరణ

మాట్లాడుతున్న ప్రొఫెసర్ చలం, పాల్గొన్న పి.మురళీకృష్ణ తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం 'చిన్నోడికి ప్రేమతో' అని ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఎస్.చలం అన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విశాఖ జిల్లాలో వున్న ప్రముఖులు, ముఖ్యంగా విద్యా రంగం, బాలల కోసం కృషి చేసిన వారితో ఆత్మీక సమ్మేళనం జరిగింది. దీనిలో భాగంగా చిన్నోడికి ప్రేమతో పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చలం మాట్లాడుతూ బాల్యంలో ప్రతి బిడ్డకూ ఎదరయ్యే అనుభవాలను వివరించారు. పుస్తక రచయిత డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ దూరంగా వున్న తన బిడ్డకి తను రాసిన ఉత్తరాలు అన్నీ బహుమతిగా ఇచ్చిన తరువాత అనేక మంది చూసి ప్రచురిస్తే బాగుంటుందనే కోరిక మీద ప్రయత్నం ముందుకెళ్లిందన్నారు.

విద్యావంతుల సమ్మేళనం సాగిందిలా..

అనంతరం విద్యావంతుల సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ప్రొఫెసర్ చలం మాట్లాడుతూ విద్యావిధానంలో సమూలమైన మార్పులతో మాత్రమే దేశానికి నాణ్యమైన మానవ వనరులు తయారవుతాయన్నారు. ప్రముఖ విద్యావంతులు ఎస్ఎస్ఆర్.జగన్నాధరావు (కార్యదర్శి, కాకినాడ క్రియ పిల్లల పండుగ) సమన్వయ కర్తగా వ్యవహరించారు. అమరావతి బాలోత్సవం బాధ్యులు పి.మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న బాలోత్సవాలు విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక అంశాలలో విద్యార్థుల సృజనాత్మకతను పెంచడానికి తోడ్పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడ బాలోత్సవాలు జరిగినా వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటున్నారన్నారరు. రాష్ట్ర వ్యాపితంగా బాలోత్సవాల విస్తరణ ద్వారా ఈ కృషిని పెంచవచ్చునన్నారు. విశాఖలో చేపట్టాల్సిన కార్యక్రమాలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో 120 మంది పాల్గొన్నారు. 34 మంది చర్చలలో పాల్గొని అభిప్రాయాలు తెలియజేసారు.

ఈదర రవికిరణ్ (సివిల్ సర్వెంట్), సుధ, శ్రీనాథ్ (ఆసరా చారిటబుల్ సొసైటీ), కన్సర్న్ వ్యవస్థాపకులు డాక్టర్ జోస్, బుద్ధ శ్రీనివాస్ (సైన్సు సెంటరు, పెద్దాపురం), విశ్రాంత ఆచార్యులు నళిని, బాల వికాస ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశ రావు, రవికిరణ్ (కమిషనరు, జిఎస్‌టి), చంద్రశేఖర్ (ప్రిన్సిపాల్, పాలిటెక్నిక్ కాలేజీ - పెందుర్తి), సునీల్ రెడ్డి (విశ్రాంత సిబిఐ ఎస్‌పి), డాక్టర్ పద్మ, కన్నయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ షోరూంలో ఆర్టిస్ట్రీ షో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిరిపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్‌లో ఆర్టిస్ట్రీ జ్యూయలరీ షో ఆభరణాల ప్రదర్శన ఘనంగా ప్రారంభమైంది. బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలను ప్రదర్శనలో ఉంచారు. ఆ ఆభరణాలు అద్వితీయమైన కళానైపుణ్యతతో, హుందాతనంతో కూడినవని స్టోర్ మేనేజర్ అహ్మద్ తెలిపారు. ఆర్టిస్ట్రీ షోలో ప్రత్యేక ఆకర్షణగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారి బ్రాండ్ సమాహారం 'మైన్' ధ్రువీకరించిన వజ్రాభరణాలు, వివాహం, పార్టీ సంబరాల కోసం, 'ఎరా' అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ఠ శ్రేణి, 'ప్రెష్యా' జాతిరత్నాభరణాల సముదాయం అందుబాటులో ఉన్నాయన్నారు. 'ఎత్నిక్స్' హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణాలు, 'జోల్' అధునాతన డిజైన్లతో కూడిన తేలికపాటి ఆభరణాలు ఉన్నాయన్నారు. 'డివైన్' భారతీయ ప్రాచీన సంప్రదాయాన్ని వ్యక్తం చేసే ఆభరణాలు, చిన్నారుల కోసం 'స్టార్లెట్' ఆభరణాలు ఎగ్జిబిషన్‌లో కొలువుదీరినట్టు వివరించారు. ఈ ప్రదర్శన ఆగస్టు 4 వరకూ ఉంటుందని తెలిపారు. బంగారు ఆభరణాల వేల్యూ ఎడిషన్‌పై 25 శాతం వరకు తగ్గింపు, స్టడెడ్ జ్యూయలరీ వేల్యూ ఎడిషన్‌పై 25 శాతం, వజ్రాల విలువపై 25 శాతం తగ్గింపు ఇస్తున్నామన్నారు.

కెకె లైన్‌లో రైళ్ల రాకపోకలు నియంత్రణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కిరండూల్ స్టేషన్ యార్డ్‌లోకి భారీగా వర్షపు నీరు రావడంతో రైల్వే పలు భద్రతా చర్యలు చేపట్టింది. ఆ మార్గంలో నడిచే రైళ్లను దంతెవాడలో షార్ట్ టెర్మినేట్ / షార్ట్ ఆరిజినేట్ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు 18514 విశాఖపట్నం-కిరండూల్ ఎక్స్‌ప్రెస్ జూలై జూలై 31 వరకు దంతెవాడలో షార్ట్ టర్మినేట్ చేయబడుతుంది. కావున 18513 కిరండూల్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ జూలై 28 నుంచి ఆగష్టు 1 వరకు కిరండూల్‌కు బదులుగా దంతెవాడ నుండి బయలుదేరుతుంది. 08551 విశాఖపట్నం-కిరండూల్ ప్యాసింజర్ జూలై 28 నుండి 31 వరకు దంతెవాడలో షార్ట్ టర్మినేట్ చేయబడుతుంది. కావున 08522 ప్యాసింజర్ స్పెషల్ రైలు 29 నుండి ఆగష్టు 1 వరకు కిరండూల్‌కు బదులుగా దంతెవాడ నుండి ప్రారంభమవుతుంది.

పాస్‌పోర్టు పోయినది

నేను షేక్ నసీమా భర్త షేక్ హుస్సేన్ నర్సీపట్నం నుంచి తాళ్లపాలెం రోడ్డులో ప్రయాణం చేస్తుండగా మాకవరపాలెం ప్రవేశించే సమయంలో నా బ్యాగ్‌లో చూడగా నా పాస్‌పోర్టు పుస్తకం కనిపించడం లేదు నా పాస్‌పోర్టు నెంబర్-N2579472 దొరికిన వారు దయ చేసి ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు

షేక్ నసీమా భర్త షేక్ హుస్సేన్
డోర్.నెం.6-44, సూర్యరావుపేట,
రాజానగరం మండలం
రాజమండ్రి అర్బన్-533294
సెల్ : 7569311263

రాళ్లు తేలిన రహదారి

కెజిబివికి వెళ్లే రహదారి

పాదచారులు, వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి గొల్లలపాలెంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి వెళ్లాలంటే రాళ్లు తేలిన రహదారే దిక్కుగా ఉంది. గొల్లలపాలెం ప్రధాన రోడ్డు నుంచి కెజిబివికి సుమారు రెండు కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఈ రహదారిలో కాలి నడకన, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. సూది మొనను పోలిన కంకర రాళ్లు తేలి ఉండడంతో దిచక్ర వాహనాల టైర్లకు ప్యాచ్‌లు పడుతున్నాయని కొందరు చెబుతున్నారు. గొల్లలపాలెం మెయిన్ రోడ్డు బస్సు దిగి ఆటోలో వెళ్లామంటే రోడ్డును చూసి కొందరు డ్రైవర్లు కెజిబివి వద్దకు రామని, వచ్చినా సరే అదనంగా చార్జీ అడుగుతున్నారని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. రోడ్డును పునర్నిర్మించాలంటూ కెజిబివి ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినులు గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. అదిగో ఇదిగో అంటూ ఐదేళ్లు గడిచాయని, రోడ్డు పునర్నిర్మాణానికి మాత్రం నోచుకోలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హయాంలోనైనా రోడ్డు పునర్నిర్మాణానికి మోక్షం కలుగుతుందని భావిస్తున్నారు.

ఇక్కడి కెజిబివిలో 6 నుంచి 10వ తరగతి వరకు 199మంది, ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థినులు 40 మంది, ద్వితీయ ఏడాది విద్యార్థినులు 36 మంది చదువుతున్నారు. 14మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు, 10 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా రోడ్డును పునర్నిర్మించాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు

నేరాలు ఘోరాలు

బైక్ నుంచి జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో కొడవటిపూడి గ్రామానికి చెందిన తేటకాల రత్నం (35) ద్విచక్ర వాహనంపై నుండి ఆదివారం జారి పడి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే...కొడవటిపూడి గ్రామానికి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఎక్కి ఆమె వస్తోంది. మార్గ మధ్యలో జారి పడి మృతి చెందగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసుల సహాయం తీసుకుని కుటుంబ సభ్యులు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. పోస్టు మార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మారికవలసలో నిరుపయోగంగా ఉన్న వాణిజ్యసముదాయం

రూ.లక్షలు వెచ్చించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు...

ప్రజాశక్తి -మధురవాడ : లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జివిఎంసి 5వ వార్డు పరిధి మారికవలస రాజీవ్‌గృహకల్ప కాలనీలో 2012 ఫిబ్రవరిలో రూ.73 లక్షలతో వాణిజ్య సముదాయాన్ని నిర్మించారు. అనంతరం హుదూద్ తుపాన్‌తో ఆ సముదాయం మరమ్మతులకు గురైంది. అప్పటి అధికారులు మరో రూ.30 లక్షలు ఖర్చు చేసి వాటిని సిద్ధం చేశారు. అక్కడి షాపులను లీజుకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పదేళ్లుగా నిరుపయోగంగానే దర్శనమిస్తోంది. ప్రస్తుతం ఈ సముదాయం మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ సముదాయాన్ని ఆధునీకరించి నెలవారీ అద్దెల రూపంలో చిల్లర వర్తకులకు, కూరగాయల చిరువ్యాపారులకు కేటాయిస్తే ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ప్రమాద బాధితునికి చెక్కును అందిస్తున్న సందీప్ పంచకర్ల తదితరులు

ప్రమాద బాధితునికి చెక్కు అందజేత

ప్రజాశక్తి- మధురవాడ : వాంబే కాలనీకి చెందిన జనసేన క్రియాశీల సభ్యుడు సాయి భాను ప్రకాష్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేలను భీమిలినియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తనూ పార్టీ ఆదుకుంటుందన్నారు. పవన్‌కల్యాణ్ ఆదేశాలతో చెక్కును అందజేసినట్లు వివరించారు. ఈ ఏడాది నియోజకవర్గం పరిధిలో సుమారు పదివేల మంది క్రియాశీల సభ్యత్వం తీసుకున్నారని, రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేలా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బి.వి.కృష్ణయ్య, శేఖర్ శీనుబాబు, ఎన్ఎన్.నాయుడు, పిల్లా శ్రీను, పి.శ్రీను, వి.చిన్న, గంగరాజు, సతీష్, రెడ్డి రాజు, కొల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి చికిత్సపై ఆర్ఎంపిలకు అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : మిథిలాపురికాలనీ కృషి జంక్షన్లో నియో, స్థానిక కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన మధురవాడ డివిజన్ ఆర్ఎంపి- గ్రామీణ వైద్యులకు కంటి వైద్య నిపుణులు డాక్టర్ బాలకృష్ణ కంటి వ్యాధులపై ఆదివారం అవగాహన కల్పించారు. కంటికి సంబంధించిన వ్యాధుల్లో గ్లకోమా అతి ప్రమాదకరమైనదని వివరించారు. ఆర్ఎంపి వైద్యులు ఎట్టి పరిస్థితుల్లోనూ కంటికి వైద్యం చేయొద్దని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్టెరాయిడ్లు, కంటి చుక్కలు వేయొద్దని, ఒక్కోసారి కంటిచూపు పూర్తిగా పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజలు కూడా మెడికల్ షాపునకు వెళ్లి కంటి చుక్కలను తెచ్చుకొని వేసుకోవడం పరిపాటిగా మారిందని, ఇది ప్రమాదకరమని వివరించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, కోన ప్రకాష్, పచ్చిపులుసు కనకారావు, ఇమ్మంది రామకృష్ణ, జగదీష్, కిరణ్, ఎన్.నాయుడు, జయరావు, రమేష్, ఈశ్వరరావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

31న టిడిపి విజయోత్సవ సభ

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్ వద్ద ఈ నెల 31న నిర్వహించే టిడిపి విజయోత్సవ సభను జయప్రదంచేయాలని పార్టీ మండల అధ్యక్షులు కోరాడ రమణ పిలుపునిచ్చారు. పద్మనాభంలోని జిల్లా పరిషత్ గృహంలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయోత్సవ సభకు అన్ని పంచాయతీల నుంచి 200 మందికి తగ్గకుండా కార్యకర్తలను తీసుకురావాలని కోరారు. ప్రతి పంచాయతీకి ఉపాధి హామీ పథకం కింద రూ.15 లక్షల పనులు చేసుకోవచ్చని తెలిపారు. గోకులం కింద మండలానికి 35 సెట్లు మంజూరైనట్లు తెలిపారు. పాడి పశువులు ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. తెలుగుదేశం పార్టీలో గ్రూపు రాజకీయాలు లేవన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేయబట్టే శాసనసభ ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గంలో పార్టీ 93000 మెజార్టీ సాధించి రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచామని గుర్తుచేశారు. విజయోత్సవ సభలో స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొని అందరికీ అభినందనలు తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, టిడిపి నాయకులు కె.లీలావతి, నందీశ్వరరావు, ఆర్.ఎన్.మూర్తి, వై.నర్సింగరావు, ఆర్.సన్యాసిరావు, టి.జగన్నాథం, ఎన్.వెంకట రావు, జి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు టిడిపి మండల సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి మండల స్థాయి సమావేశం ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షులు దంతులూరి అప్పల నరసింహరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సకాలంలో హాజరు కావాలని పార్టీ మండల స్థాయి నాయకులను కోరారు.

సాగరతీరానికి సందర్శకుల తాకిడి

ప్రజాశక్తి -భీమునిపట్నం : సాధారణ రోజుల్లోనే సాగరతీరం సహజంగానే సందర్శకుల రాకతో కిటకిట లాడుతుంది. ఆదివారం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినం కావడంతో విద్యార్థులు, కుటుంబ సభ్యులు, యువతీ యువకులు బీచ్‌కు మరింత ఎక్కువగా వచ్చారు. సాయంకాల సమయంలో పర్యాటకులు, సందర్శకులు ఎక్కువ మంది వచ్చారు. పొర్యులను కూడా సందర్శించి కాసేపు సరదాగా గడిపారు. కొందరు సముద్రంలో స్నానాలు చేశారు. సాగర తీర అందాలను ఆస్వాదించారు.

ఇన్‌ఛార్జి వార్డెన్లతోనే...

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం, అనంతవరం, రెడ్డిపల్లి గ్రామాల్లో ఉన్న మూడు బిసి హాస్టళ్లు తొమ్మిదేళ్లుగా ఇన్‌ఛార్జి వార్డెన్లతో నడుస్తున్నాయి. గత పదేళ్లుగా నియామకాలు లేకపోవడంతో విశాఖ జిల్లాలో ఉన్న 50 శాతం హాస్టళ్లు ఇన్‌ఛార్జిలతోనే నడుస్తున్నాయి. ప్రభుత్వాలు విద్యార్థుల భవిష్యత్తు కోసం హాస్టళ్లను ఏర్పాటుచేసి ప్రతిరోజూ మెనూ నిర్వహణ వంటి కార్యక్రమాలు పగడ్బందీగా నిర్వహిస్తున్నప్పటికీ, వార్డెన్ల నియామకాల్లో జాప్యం చేస్తుండడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వాలు, జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఖాళీ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు భవిష్యత్తుకు సహకరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. 8 నెలలుగా హాస్టల్ బిల్లులు చెల్లించకపోవడంతో వార్డెన్లు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. పద్మనాభం బిసి బాయ్స్ హాస్టల్‌లో 9 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం నేటికీ దిగ్విజయంగా పనిచేస్తోంది. కానీ సోలార్ సిస్టం హాట్ వాటర్ పైప్‌లైన్ పూర్తిగా పాడైపోయింది. కొన్ని హాస్టళ్లలో ఏర్పాటు చేసిన రెండేళ్లకే వాటి కాలం చెల్లింది. ప్రతి ఏడాది హాస్టల్ విద్యార్థులు 10వ తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు.

ఏడాదికి మూడు సమావేశాలు

మండలంలోని పద్మనాభం బిసి హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులతో ఏడాది కాలంలో మూడుసార్లు ప్రత్యక్ష సమావేశాలను వార్డెన్ ధనరాజు ఏర్పాటుచేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ హాస్టల్లో 95 మంది, రెడ్డిపల్లి బాలికల హాస్టల్‌లో 55 మంది విద్యార్థులు ఉన్నారు.

సుమారు 45 గదులతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో సహ 400 మందితో ఈ హాస్టల్‌ను మూడో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నిర్వహించేందుకు ఏర్పాటుచేస్తున్నారు.

గెడ్డల్లో పూడికల తొలగింపు

ప్రజాశక్తి- పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభం పంచాయతీలో 25 సంవత్సరాలుగా గెడ్డలో పేరుకుపోయిన పూడికలను సర్పంచ్ తాలాడ పాప ఆదివారం తొలగింపజేశారు. అనంతపద్మనాభ స్వామి కొండ గెడ్డకు ఇరువైపులా గృహాలు కట్టడంతో గెడ్డ పూడుకుపోయింది. కొద్దిపాటు వర్షం పడినా నీరు వెళ్లే మార్గం లేకుండా పోయింది. కొండవాలు కావడంతో వర్షపు నీరు నేరుగా గృహాల్లోకి చేరిపోతుంది. ఇళ్ల వాడుక నీరు కూడా గెడ్డలో చేరి మురుగుమయమైంది. దుర్వాసన వెదజల్లుతూ ఈగలు, దోమలు ప్రబలి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా గత సర్పంచులు పట్టించుకోకుండా వదిలేశారు. ఈ నెల 24న పద్మనాభం పంచాయతీలో గ్రామ మహాజన సభలో పలు పార్టీ నాయకులు, గ్రామస్తులు కొండగట్టు సమస్యను లేవనెత్తారు. దీంతో మూడు రోజులుగా ప్రత్యేక దృష్టి పెట్టి పూడికతీత పనులు ప్రారంభించారు. ఈ సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొండ గెడ్డలో సాగుతున్న పూడికల తొలగింపు పనులు

శేరికాండం పంచాయతీలో

మండలంలోని శేరికాండం పంచాయతీలో పదేళ్లుగా ఉన్న కొండగెడ్డ పూడికలను సర్పంచ్ పల్లెంటి చిన్నారావు రెండు రోజులుగా తొలగింపు చేపట్టారు. సుమారు 60 ట్రాక్టర్ల లోడును తరలించారు. మురుగు సమస్య పరిష్కారం కావడంతో ఆ గ్రామస్తులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యంత్రాల సాయంతో ముళ్ల పొదల తొలగింపు

గ్రామంలో శ్రమదానం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, అమనాం గ్రామంలో ఉన్న ఊట చెరువు పరిసరాల్లో ఎంతో కాలంగా పేరుకుపోయిన ముళ్లపొదలు, తుప్పలను ఆదివారం యంత్రాల సాయంతో తొలగించారు. టిడిపి గ్రామ పంచాయతీ అధ్యక్షులు చుక్క ఆదిరెడ్డి ఆధ్వర్యాన చెరువు పరిసరాలను కూడా శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దంతులూరి నృసింహసత్యనారాయణ రాజు, సరగడ రఘురాంరెడ్డి, కంబపు శివకుమార్, జనసేన నాయకులు అనిల్ కుమార్, గణేష్ పాల్గొన్నారు.

అగనంపూడి టోల్‌గేట్‌ను శాశ్వతంగా ఎత్తివేయాలి

సిపిఎం స్టీల్ జోన్ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడి టోల్ గేట్‌ను శాశ్వతంగా ఎత్తివేయాలని 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగనంపూడి టోల్ గేట్ శాశ్వతంగా ఎత్తివేయాలని, టోల్ గేట్ కోసం పిలిచిన టెండర్లు వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యాన అగనంపూడి టోల్ గేట్ వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. స్టీల్ జోన్ కమిటీ సభ్యులు యు.మరిడయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే అగనంపూడి టోల్‌గేట్‌ను తన అనుచరులతో పగులగొట్టి ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీని నెరవేర్చానని ఆర్భాటంగా ప్రకటించారన్నారు. ఇది జరిగిన కొద్ది రోజులకే భోగాపురం ఎయిర్ పోర్ట్ సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేషనల్ హైవే అధికారులకు అగనంపూడి టోల్ గేట్ కొనసాగించాలని ఆదేశాలు ఇవ్వడం తెలుగుదేశం పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం అని విమర్శించారు. వీరి వైఖరికి అనుగుణంగా హైవే అథారిటీస్ అగనంపూడి టోల్ గేట్ తిరిగి ప్రారంభించడానికి టెండర్లు పిలిచిందని ఈ టెండర్లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

సిపిఎం స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, అనకాపల్లి నుంచి ఆనందపురం రహదారిని ప్రారంభించి అక్కడ టోల్ గేట్ ఏర్పాటు చేసిన తర్వాత అగనంపూడి టోల్ గేట్ ఎత్తివేస్తామని చెప్పినా దాన్ని నడిపిస్తూ ప్రజల నుంచి దోచుకుంటున్నారని విమర్శించారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే టోల్ గేట్ ఎత్తివేస్తూ జిఒ జారీ చేయాలని డిమాండ్‌చేశారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

విద్యార్థి దశ నుంచే లక్ష్యం ఉండాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యం ఉంటే విజయం వరిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్ అన్నారు. కేంద్ర గౌరీ గవర సేవా సంఘం ఆధ్వర్యాన గవర ఉత్తమ విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం, అభినందన సభ-2024 ఆదివారం ఉదయం అక్కయ్యపాలెం పోర్టు కళావాణి ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్వతీపురం జిల్లా కలెక్టర్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ, తాను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి చిన్న ప్రభుత్వ ఉద్యోగంలో చేరానని, ఉన్నత లక్ష్యంతో చదివి కలెక్టర్ స్థాయికి ఎదిగానని చెప్పారు. ఐఎఎస్ చదవాలనుకునే వారికి అవసరమైన పాఠ్యపుస్తకాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, ప్రస్తుతం చదువుతున్న పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో స్థిరపడేందుకు అవసరమైన బోధన పొందేలా కేంద్ర గౌరీ సేవా సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని సంఘం ప్రతినిధులను కోరారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ మల్ల భాస్కర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షులు బుద్ద శివాజీ మాట్లాడుతూ, ప్రతిభ కనబరిచే పేద పిల్లలను ఉచితంగా చదివిస్తామని ఇచ్చిన పిలుపుమేరకు తమ వర్గంలో కొంతమంది పెద్దలు అందించిన సహకారంతో ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. 80శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటో, నగదు ఇచ్చి సత్కరించామన్నారు. పదవ తరగతి నుంచి పీజీ వరకు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే గణబాబు, డాక్టర్ మల్ల భాస్కర్ చేతుల మీదుగా ప్రతిభ గల విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేసి అభినందించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వైస్ ఛైర్‌పర్సన్ బీశెట్టి సత్యవతమ్మ, బొడ్డేటి కాశీ విశ్వనాథం, మల్ల రామనాయుడు, సంఘం ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చుఅప్పారావు, ఉపాధ్యక్షులు మొల్లేటి వీర కుమారస్వామి, వేగి సత్యనారాయణ, బొడ్డేడ అప్పారావు, మల్ల బలరాం తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రప్పడు విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలని వినతి

ప్రజాశక్తి-మాధవధార : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ సంఘాల ఉద్యమ రథసారధి, గ్రంథాలయ ఉద్యమ నాయకులు కీర్తిశేషులు గుళ్ళిపల్లి సింహాద్రప్పడు విగ్రహాన్ని మురళీ నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేయుటకు కార్పొరేషన్ నుంచి అనుమతి కోసం ప్రతిపాదన చేయాలని కోరుతూ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా నాయకులు ఆదివారం సనపల వరప్రసాద్ ఆధ్వర్యాన కలిసి వినతిపత్రం అందించారు. ముందుగా ఎన్నికల్లో విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నిబంధనల ప్రకారం విగ్రహం ఏర్పాటు విషయంలో తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు సిహెచ్.కరుణాకరరావు, ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, ఎస్.ఉమాపతి, బి.ముత్యాలనాయుడు, గొల్ల సత్యనారాయణ, కొయ్య శ్యామ్‌కుమార్, జి.మురళీ, జి.ఎర్రినాయుడు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారునికి అభినందనలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన గాజువాకకు చెందిన రాహుల్‌ను విశాఖ పశ్చిమ కార్యాలయంలో ఎమ్మెల్యే గణబాబు అభినందించారు. పోటీలకు ఎంపికైన సందర్భంగా ఎమ్మెల్యేను రాహుల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏషియన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక కావడంపై గణబాబు ప్రత్యేకంగా అభినందించారు. చైనాలో జరుగుతున్న ఈ పోటీల్లో విజయం సాధించి దేశానికి, రాష్ట్రానికి, విశాఖపట్నానికి మరింత పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం బిసి సాధికారిక రాష్ట్ర సభ్యులు అంగటి మూర్తి, శివకుమార్ పాల్గొన్నారు.


రాహుల్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ఘనంగా రావిశాస్త్రి జయంతి

రావిశాస్త్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-సీతమ్మధార : కవి రాచకొండ విశ్వనాథశాస్త్రి 102వ జయంతిని ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రచయిత, న్యాయవాది వృద్ధుల కల్యాణ రామారావు హాజరై మాట్లాడారు. రావి శాస్త్రి రచనలను అన్ని వర్గాల ప్రజలు ఇష్టపడతారని తెలిపారు. రావిశాస్త్రి దగ్గర ఒకరోజు జూనియర్‌గా చేశానని గుర్తు చేసుకున్నారు. రావి శాస్త్రి పరిచయంతో వాస్తవ సమాజాన్ని చూసానని, తిరిగి వెనక్కి వెళ్లలేదని తెలిపారు. శాస్త్రి రచనలు చదువుతూ ఉంటే ఆత్మీయత కనిపిస్తుందన్నారు. మాయ, న్యాయం, కోర్టుకురాని సాక్షులు, ఉరిశిక్ష, ఆఖరి దశ, మోక్షం వంటి కథలు కోర్టు వాతావరణాన్ని తెలియజేస్తున్నాయని తెలిపారు. అల్పజీవి నవల పూర్తి మనో విశ్లేషణతో ఉంటుందన్నారు. శాస్త్రి రచనలు ఒకసారి చదివితే, మరోసారి చదవాల్సిన అవసరం ఉండదని, అవి మనలో నిక్షిప్తం అయి ఆలోచింపచేస్తాయన్నారు.

నవలా రచయిత జివిఎస్ చలం మాట్లాడుతూ, మాండలిక భాషలో ఉత్తరాంధ్ర పాత్రోచిత భాషను తన రచనల్లో శాస్త్రి రాశారన్నారు. సాహిత్యం మనిషిని కలుపుతుందని, రావిశాస్త్రి రచనలు చదివితే సాహిత్యాన్ని అప్ గ్రేడ్ చేసుకుంటామన్నారు. రావి శాస్త్రి కుమారుడు మోహన్ కుమార శాస్త్రి మాట్లాడుతూ, తాను రావి సంతానంలో చివరి వాడినని, సాహితీ సభలు నిర్వహిస్తున్న వర్మకు అభినందనలు తెలిపారు. రచనల్లో చెప్పినట్టే ఆయన జీవితాన్ని నిరాడంబరంగా గడిపారన్నారు. ప్రముఖ విమర్శకులు వర్మ స్వాగత ఉపన్యాసం చేస్తూ తెలుగు జాతి గర్వించదగ్గ రచయిత రావి శాస్త్రి అన్నారు. మానవ సహజ భావోద్వేగాలను, స్వభావాలను పట్టించే పాత్రలు ఆయన రచనల్లో కనిపిస్తాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన కుమార్ కూనపరాజు మాట్లాడుతూ, శాస్త్రి రచనలు నేటి ఆధునిక యుగంలోని సాహిత్యానికి అనుబంధంగా ఉంటాయన్నారు. సభకు ముందుగా ప్రజా కవి దేవిశ్రీ రావి శాస్త్రిపై రాసి ఆలపించిన "సాహితి మేస్త్రీ మా రావి శాస్త్రి" పాట అందరిని ఆకట్టుకుంది. అనంతరం రావిశాస్త్రి కథా పురస్కారాలను యువ రచయితలు సురేంద్ర శీలం, శ్రీ ఊహ, మల్లిపురం జగదీష్‌కు అందించి సత్కరించారు. ఉదయనిధి సంస్థ ఏర్పాటుచేసిన జయంతి సభలో ప్రముఖ కవులు చిన వీరభద్రరావు, కె.మల్లేశ్వరి, పాత్రికేయులు దాడి ప్రకాష్, సాహితీ ప్రియులు వై.వేణుగోపాల్ రెడ్డి, శాస్త్రి అభిమానులు, సాహిత్య ప్రియులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరాయనగర్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -గాజువాక : విశ్వేశ్వరాయనగర్ కాలనీ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. ప్రెసిడెంట్‌గా గొల్లపల్లి శ్రీనివాసరావు, సెక్రటరీగా బొడ్డు రవికుమార్, కోశాధికారిగా డి.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులుగా వెంకన్న చౌదరి, వైస్ ప్రెసిడెంట్‌గా జగన్‌ను కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో 71వ వార్డు జనసేన అధ్యక్షులు బేతు చైతన్యకృష్ణ, నాయకులు అప్పలరెడ్డి, వెలిది శ్రీనివాసరావు, నారండి శ్రీనివాసరావు బిజెపి నాయకులు కట్ట పద్మ, తదితరులు పాల్గొన్నారు.

టమాటాలకు క్యూ

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార రైతు బజారులో టమాటాల కోసం జనం క్యూలైన్లో ఎగబడ్డారు. కిలో రూ.32కు రాష్ట్ర ప్రభుత్వం అందించడంతో వినియోగదారులు భారీగా తరలివచ్చారు. ఎక్కువసేపు క్యూ లైన్ ఉండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. కౌంటర్లు పెంచే విధంగా మార్కెటింగ్ శాఖ అధికారులు చొరవ చూపాలని వినియోగదారులు కోరారు. రైతు బజార్లో బంగాళాదుంపల కోసం కూడా కొనుగోలు దారులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పశ్చిమ బెంగాల్ నుంచి రవాణా ఆగిపోవడంతో కొరత ఏర్పడిందని, మధ్యాహ్నానికి బంగాళాదుంపలు వచ్చినట్లు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు తెలిపారు.

ఐటిఐ సీట్లపై ఆందోళన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఐటిఐ సీట్ల కొరతపై ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన కంచరపాలెం ప్రభుత్వ ఐటిఐ వద్ద విద్యార్థులు ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ, కంచరపాలెం ప్రభుత్వ ఐటిఐలో సీట్ల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఆన్‌లైన్‌లో కళాశాలకు అప్లై చేసుకున్న సమయంలో ఒక్క కంచరపాలెం ప్రభుత్వ ఐటిఐ మాత్రమే ఆప్షన్ చూపించడంతో విద్యార్థులు దానికే అప్లై చేశారని తెలిపారు. కంచరపాలెం ఐటిఐలో శనివారంతో అడ్మిషన్లు పూర్తిస్థాయిలో ముగిసినప్పటికీ విద్యార్థులకు ఆదివారం ఉదయం 8 గంటలకు రావాలని మెసేజ్ పెట్టడంతో అధిక సంఖ్యలో కళాశాలకు చేరుకున్నారని తెలిపారు. విద్యార్థులు వచ్చిన తర్వాత ఐటిఐలో ఎవరూ స్పందించలేదన్నారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఇతర ఐటిఐల్లో సీటు వచ్చేలా చొరవ తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.శ్రీను, కిరణ్, గణేష్, దిలీప్, హేమానంద్, గ్రేస్ ప్రకాష్ పాల్గొన్నారు.

మా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

ప్రజాశక్తి- గాజువాక : మా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు గాజువాక నియోజకవర్గానికి చెందిన 104 మంది బాధితులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి మండలం గొలగం పంచాయతీకి చెందిన సర్వేనెంబర్ 137/3లో 2012వ సంవత్సరంలో కాగితాల కల్పన భర్త రమణారెడ్డికి చెందిన సమృద్ధి వెంచర్‌లో ప్లాట్లు కొలుగోలు చేశామని తెలిపారు. సబ్బవరం రిజిస్ట్రేషన్ ఆఫీసులో లింకు డాక్యుమెంట్‌తో రిజిస్టర్ అయిన ఈ భూములను గత వైసిపి ప్రభుత్వం 22 ఎ లో పెట్టి, క్రయవిక్రయాలు చేయకూడదని నిబంధనలను పెట్టిందని వివరించారు. ఈ భూములపై గత ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్ ఎన్ఒసి కూడా ఇచ్చారని తెలిపారు. ఎన్ఒసి ఇచ్చిన భూములను 22 ఏలో పెట్టడం అన్యాయమని, రెండేళ్లుగా అధికారులు చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఆ భూములను స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చినవని, వారు అమ్ముకోవడానికి పూర్తి హక్కులు ప్రభుత్వం కల్పించినప్పటికీ, 22 ఎ లో ఎందుకు పెట్టాల్సి వచ్చిందో అనకాపల్లి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గంధం శ్రీనివాసరావు, డి.రమణ, మోహనరావు, టివిఎస్.అప్పారావు, సూర్యారావు, బాధితులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

అంబికాబాగ్ దేవాలయ భూముల పరిరక్షణకు

నేడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ఆక్రమణదారులను అరెస్ట్ చేయకుంటే ఉద్యమం తప్పదు : సిపిఎం

ప్రజాశక్తి -అనకాపల్లి : దేవాలయ భూములను ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ శంకర్రావు, వి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలోవారు మాట్లాడుతూ, అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో విశాఖ పూల్‌బాగ్ రాణిగారితోట శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థాన (అంబికా బాగ్) దేవస్థానానికి చెందిన రూ.1150 కోట్లు విలువైన సర్వేనెంబర్ 66లోని 29.71 ఎకరాల భూములు దేవాదాయ శాఖల ఆధీనంలో ఉన్నాయన్నారు. ఈ భూములను శనివారం కొంతమంది ఆక్రమించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, సోమవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. భూములు పరిరక్షణకై చుట్టూ కంచె వేసి సెక్యూరిటీని కూడా దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిందని, అయితే పట్టపగలు కొంతమంది ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఎండోమెంట్ బోర్డులను, కంచెను తొలగించి చదును చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ప్రస్తుతం వందల కోట్లు ఖర్చుపెట్టి ఎన్నికల్లో పోటీ చేసిన రాజకీయ నేతలు, వేల కోట్లను విలువ చేసే భూములను కబ్జా చేయడం అలవాటైందని మండిపడ్డారు. ఇటువంటి వారిపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఉదయం నుంచి కబ్జా జరుగుతున్న మధ్యాహ్నం వరకు కనీసంగా ప్రభుత్వపరంగా సంబంధిత అధికారులుగానీ, దేవాదాయ శాఖ యంత్రాంగం కానీ పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉందన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్

రాష్ట్ర ప్రభుత్వం భూ కబ్జాలపై, అవినీతిపై అసెంబ్లీలో పెద్ద ఎత్తున శ్వేత పత్రాలు విడుదల చేసి ఆక్రమణలపైన, భూకబ్జాలపైన చర్చ జరుగుతున్న నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలు ముగిసిన మరుక్షణమే కోట్లాది రూపాయలు విలువైన భూములపై అధికార పార్టీ అండదండలతో ఆక్రమణకు పాల్పడడం దుర్మార్గమన్నారు. దీనిపై ఎండోమెంట్ అధికారులు, స్థానిక ఎంపీ ఎమ్మెల్యేలు వెంటనే జోక్యం చేసుకొని ప్రభుత్వ భూములు, దేవుడి భూములను సంరక్షించాలని సిపిఎం తరపున డిమాండ్ చేశారు. గతంలో కొణతాల రజిని, తదితర పేర్లతో ఈ భూములపై తమకు హక్కు ఉందని కోర్టుకెక్కి స్టే పేరుతో ఇపుడు తమ భూములేనని చెబుతున్నట్లుగా ఎండోమెంట్ అధికారులు వెల్లడిస్తున్నారని, గతంలో ఇదే భూములపై సిపిఎం జెండాలను పాతి ఈ భూములను పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని కోరితే ఇది భూ ఆక్రమణ అని సిపిఎం నాయకులపై కేసులు పెట్టారన్నారు. దేవాదాయ భూములని అధికారులు అపుడూ, ఇపుడూ స్పష్టం చేస్తున్న నేపథ్యంలో ఇవి అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాంటి పరిస్థితుల్లో నేడు ప్రైవేటు వ్యక్తులు వచ్చి ప్రోక్లైన్లతో భూమిని చదును చేస్తుంటే అధికారులు, ప్రభుత్వం మీన మీసాలు లెక్కించడం అన్యాయం అన్నారు. ఈ ఘటనపై తగిన విచారణ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, వెంటనే ఆక్రమణ దారులపై కేసు నమోదు చేసి తగిన చర్యలకు ఎండోమెంట్ అధికారులు ఉపక్రమించాలని కోరారు. లేకపోతే ప్రజా పోరాటాలకు సిద్ధం కావల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, కాళ్ళ తేలయ్యబాబు, డిడి వరలక్ష్మి పాల్గొన్నారు.

కేబుల్ ఎక్స్‌పోకు ఆపరేటర్లు తరలి రావాలి

ప్రజాశక్తి.-అనకాపల్లి : ఈనెల 29, 30, 31 తేదీలలో విజయవాడలో మూడు రోజులు పాటు భారీ ఎత్తున నిర్వహిస్తున్న కేబుల్ ఎక్స్పో కార్యక్రమంలో కేబుల్ టీవీ ఆపరేటర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకుడు కెవిఎస్ ప్రకాష్ ఆపరేట్లను కోరారు. ఆదివారం సంఘ నాయకులతో కలిసి ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని భారీ ఎత్తున నిర్వహిస్తున్న కనెక్ట్ ఏపీ 2024 కేబుల్ ఎక్స్ పో, టెక్నికల్ సెమినార్ కు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ముఖ్యఅతిథిగాను, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యవస్థకు చెందిన నిష్ణాత్ములు అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ ఎక్స్ పో లో అనేక విలువైన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా జాతీయస్థాయిలో పేరొందిన దేశ, విదేశీ బ్రాండెడ్ కంపెనీలు వందలాది స్టాల్స్ ఏర్పాటు చేసి, తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సాంకేతిక సెమినార్ లో దినదినాభివద్ధి చెందుతున్న డిజిటల్ యుగంలో సాంకేతిక అంశాలను అవగతం చేసుకుని, రానున్న రోజుల్లో ఆపరేటర్లు తమ మనుగడను ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి అన్నది పెద్దలు దిశా నిర్దేశం చేయనున్నారన్నారు. ఇటువంటి సాంకేతిక ఎక్స్పో , సెమినార్ల ను పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, విజయవాడలో జరిగే ఎక్స్ ఫో ను ప్రభుత్వ%శీ% సహాయంతో, ఆపరేటర్ల సంక్షేమ కోసం నిరంతరం పరితపించే పెద్దలు విజయవంతం చేయడానికి కొన్ని నెలలుగా తీవ్రంగా కషి చేయడం గొప్ప శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో దాడి ఈశ్వరరావు, పొలమరశెట్టి ఈశ్వరరావు, నడిపల్లి నాగేశ్వరరావు, భేతి వెంకటరమణ,గెడ్డం భాస్కరరావు, తానాం అప్పారావు, దొడ్డి రాజు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-పరవాడ: జిఆర్‌కే మ్యూజిక్ ఆధ్వర్యంలో స్వరగమనం పేరిట ఆదివారం నిర్వహించిన సిని సంగీత విభావరి ఆద్యంతం ఉల్లాసంగా సాగింది. జిఆర్‌కే సంస్థ అధినేత గేదెల ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గాయని కనకమహాలక్ష్మి నేతత్వం వహించారు. లంకెలపాలెంలో గాయకుడు భాస్కర రావు వ్యాఖ్యానంతో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు సినిమా పాటలను ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. అనకాపల్లికి చెందిన బాలికలు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు భళా అనిపించాయి. అనంతరం సినిమా పిచ్చోడు మూవీ యూనిట్ సందడి చేసింది. సినిమా హీరో కుమారస్వామి, రచయిత, లఘుచిత్ర దర్శకుడు నాని నాయుడు, పలువురు కళాకారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో జిఆర్‌కే సంస్థ అధినేత గేదెల ఈశ్వరరావు మాట్లాడుతూ జిఆర్‌కే మ్యూజిక్ బ్యానర్‌పై ప్రతినెలా సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నామని, తద్వారా కళాకారులను ప్రోత్సహించే అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. చక్కగా పాడే గాయని గాయకులకు ప్రైవేట్ ఆల్బమ్‌లో అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. షార్ట్ ఫిలిం లో కూడా నటించే అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో సినిమాలోపాటలు పాడే అవకాశాన్ని కళాకారులకు అందిస్తామన్నారు. దామోదర్ మ్యాజిక్ షో అలరించింది. అలాగే జూనియర్ హరికృష్ణ నటన ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిఆర్‌కె అధినేత ఈశ్వర్, సినిమా పిచ్చోడు కుమార్‌స్వామి, రెడ్డి స్వామి, నాని, నాయుడు, జి అప్పల రాజు, నాని వెంకట, పైడ్రాజు, వెంకట రమణ, దామోదర్, పద్మ, లక్ష్మీ ప్రియ, శ్రీనివాస్, భాస్కర్, కనకమాలక్ష్మి, లావణ్య, జగదీశ్వరి, లీలా పాల్గొన్నారు.

సంగీతవిభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులు, కళాకారులు

నేడు గరికపాటి ప్రవచనం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రతిష్ట శతజయంతిని పురస్కరించుకొని సోమవారం ఆలయ ప్రాంగణంలో మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు ప్రవచనం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కవులు, తెలుగు భాష అభిమానులు, ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యలను పరిష్కరించండి

సమస్యలు వివరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైల్వే అధికారులకు విన్నవించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 3వ ఫ్లాట్ ఫారంలో ఫ్లోర్‌కు గ్రానైట్ వాడడం వలన జారిపడే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారన్నారు. అలాగే స్టేషన్లో ప్రయాణికులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ చిన్నియాదవ్,ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్,అంబేద్కర్ సేవాసమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, నటభూషణ్ శోభన్ బాబు సేవాసమితి చైర్మన్ ముగడ అప్పారావు, సామాజిక నాయకులు నాగేశ్వరరావుచౌదరి, బ్రాహ్మణ సంఘం నాయకులు సాయిబాబా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజుకు ఘనసత్కారం

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కళాసీల సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి- చోడవరం రూరల్: మండల కేంద్రం చోడవరం కళాసీల కళ్యాణమండపంలోస్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్.రాజును స్థానిక కళాసీల యూనియన్ నేతలు ఆదివారం ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కళాసీల సమస్యల పరిష్కారానికి, వారికి అవసరమైన సౌకర్యాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజు భరోసానిచ్చారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులుమళ్ల నాయుడు, మాజీ ఎంపిపి పెదబాబు,టిడిపి చోడవరం పట్టణఅధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు సకూరు కోటీ బాబు తదితరులను కూడా కళాసీలు సత్కరించారు. కార్యక్రమంలో కళాసీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి,ఇ తర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కన్వీనర్‌గా జగన్మోహన్

జగన్మోహన్‌ను అభినందిస్తున్న తోటి ఉద్యోగులు

ప్రజాశక్తి -చోడవరం : పిఎసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ అనకాపల్లి జిల్లా కన్వీనర్‌గా బొడ్డేడ జగన్ మోహనరావు ఎంపిక అయ్యారు. ఆదివారం చోడవరంలో జరిగిన జిల్లా యూనియన్ మహాజన సభలో ఎన్నిక నిర్వహించారు. బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట ప్రాథమిక సహకార సంఘంలో సిఇఒగా జగన్ మోహన్ పని చేస్తున్నాడు. సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా నిర్వహించారు. కార్యక్రమం లో చోడవరం బ్రాంచి పరిధిలోని 13 సంఘాలు ఉద్యోగులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను ఉద్యోగులు అభినందించారు.

చిరుధాన్యాలతో పులి చిత్రం

చిరుధాన్యాలతో రూపొందించిన పులి చిత్రపటం

ప్రజాశక్తి-విశాఖపట్నం : అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిరుధాన్యాలతో పులి చిత్రాన్ని నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ తీర్చిదిద్దారు. ఏటా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. అంతరించిపోతున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందనే సందేశాన్ని చాటుతూ విజయ్ కుమార్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. వారం రోజులు శ్రమించి కేవలం మిల్లెట్స్‌తో ఈ చిత్రపటాన్ని రూపొందించారు.

రంగస్థల నటుడు ఈశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రముఖ రంగస్థల నటుడు మిర్తిపాటి ఈశ్వరరావు(కొప్పాక ఈశ్వరరావు) మృతి నాటక రంగానికి కళారంగానికి తీరని లోటని చిత్రకారుల సంఘం మాజీ అధ్యక్షుడు దేవాదుల ప్రకాష్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని రామభద్రపురం గ్రామంలో ఈశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్య హరిచంద్ర, బాలనాగమ్మ, చింతామణి, రామాంజనేయ యుద్ధం వంటి పలు పౌరాణిక జానపద చారిత్రాత్మక నాటకాల్లో ఈశ్వరరావు నటించి పలువురి మన్ననలు పొందారన్నారు. టైలరింగ్ వృత్తిని కొనసాగిస్తూనే నాటకరంగంపై మక్కువతో అనేక నాటకాలు ప్రదర్శించారని, ఎంతోమంది వర్ధమాన కళాకారులను ప్రోత్సహించారన్నారు. ఈశ్వరరావు మృతి పట్ల కళాకారుల సంఘం ప్రతినిధులు దేవాదుల శివాజీ, పొలిమేర మణి, ఎం జగన్నాధరావు, సత్తిపండు, కే వెంకటరెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

సామాజికవేత్త కాశీ మరణం తీరనిలోటు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ సామాజిక వేత్త, తూర్పు కాపు సంఘం నాయకులు, వెంకటలక్ష్మి ప్రింటింగ్ ప్రెస్ అధినేత కోరుకొండ కాశి మృతి తీర్చలేనిదని పలువురు అభిప్రాయపడ్డారు. ఈనెల 18న కాశి మరణించిన నేపథ్యంలో ఆయన మృతి పట్ల పలువురు మాట్లాడుతూ అనకాపల్లి కొట్నీ వీధికి చెందిన కాశి పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఫీజులు కట్టడం, అలాగే గాంధీ బొమ్మ కళాకారులకు అండగా నిలవడం, తూర్పు కాపు సంఘంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, గుడివాడ గురునాధరావులకు ముఖ్య అనుచరుడిగా పని చేశారన్నారు. ఆయన లేని లోటు సమాజానికి తీరనిదన్నారు. ఆయన పెద్దకర్మ సోమవారం ఆయన స్వగృహంలో నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

శివాలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సబ్బవరం: మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామం గెడ్డం వీధికి చెందిన యడ్ల నాయుడు రూ.50,116 ఆర్థిక సహాయం ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు యడ్ల నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కష్ట, కోరాడ శ్రీనివాసరావు, దేంగేటి నాని, దంగేటి ప్రకాష్, అక్కుబాబు, చింతల శ్రీను, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండలంలోని అసకపల్లిలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో అసకపల్లి సర్పంచ్ కర్రి నరిసింగరావు, నారపాడు సర్పంచ్ మామిడి శంకర్రావు, జనసేన నేతలు ఇందల వెంకటరమణ,కర్రి కనకరాజు, గొర్లె నూకరాజు పాల్గొన్నారు.

సంక్షోభంలో ఇటుకల పరిశ్రమ!

- డిమాండ్ లేక గిట్టుబాటు కాని ధర
- అప్పుల ఊబిలో తయారీదారులు
- ప్రభుత్వం మార్పుతోనైనా మంచిరోజులొస్తాయా ?

పరవాడలో ఉన్న ఇటుకల తయారీ బట్టీ

ప్రజాశక్తి- కె.కోటపాడు : సంవత్సరాల తరబడి రేటు పెరగకపోవడంతో ఇటుక బట్టీల యజమానులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇటుక రేటు ఒక్కొక్కటి ఏడు రూపాయలు ఉండగా, గత ఐదేళ్లగా అదేధర, అంతకుకంటే తక్కువ ధర ఉండడంతో యజమానులు నష్టపోయే పరిస్థితి ఉంది.ఇటుక తయారీకి అవసరమైన ముడి సరుకులు బంకమట్టితో పాటు ఇప్పుడు బియ్యం వాక బూడిద, బొగ్గు కొబ్బరి పీచు ఒక తదితరాలు రేట్లు మాత్రం తగ్గలేదు. ఒక వెయ్యి ఇటుక తయారీకి రూ.4000 వరకు ఖర్చు అవుతుంటే అన్ని సక్రమంగా ఉంటే రూ.4500 నుంచి రూ.ఐదువేలకు మించి అమ్ముడుపోవడం లేదని, దీంతో గిట్టుబాటు కాక నష్టపోతున్నామని వాటి తయారీదారులు ఆవేదన చెందుతున్నారు.. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక దొరకపోవడం కారణంగా ఇన్నాళ్లుగా భవన నిర్మాణాలు అంతంత మాత్రంగా ఉండడంతో సరైన డిమాండ్ లేకపోవడం వల్లే ఇటుకల ధరకూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుఉండిపోయిందని వారు అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలనీ ఇల్లు కూడా అనుకున్న స్థాయిలో మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు చాలామంది నేటికీ ఇల్లు కట్టుకోలేని పరిస్థితిలో ఉన్నారు ఇవన్నీ ఇటుకల తయారీపై ప్రభావం చూపి, వాటి తయారీదారులు ఆర్థికంగా నష్టపోయి అప్పులుపాలైన దుస్థితికి దారి తీసిందని అంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక సరఫరాపై నియంత్రణ ఎత్తేసి, రవాణా ఖర్చులు చెల్లిస్తే ఉచితంగా అందజేసేలా నిర్ణయం తీసుకోవడంతో నిర్మాణరంగం మళ్లీ ఊపందుకుంటుందని, తద్వారాఇటుకల తయారీదారులకు మంచి రోజులు వస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాకాకుండాప్రస్తుతమున్న పరిస్థితి కొనసాగితే ఈ వృత్తి నుండి పూర్తిగా దూరం కాక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

హామీ మేరకు 'సుగర్స్'ను తెరిపించాలి

ఎంపీ సిఎం రమేష్‌ను కోరిన వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరపల్లి: కొత్త పరిశ్రమలు మాట పక్కనబెడితే, ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం మూతబడి ఉన్న పరిశ్రమలు తెరిపించి ఎంపీ సిఎం రమేష్ మాట నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 13 సహ కార చక్కెర కర్మాగారాలు ఉన్నాయని వీటిలో ప్రస్తుతం గోవాడ (చోడవరం) కర్మా గారం మిగతా అన్నీ మూతపడ్డాయని తెలిపారు. ఈ కర్మాగారాల్లో మెజార్టీ ఉత్తరాంధ్రలోనే, అందులోనూ అనకాపల్లి జిల్లా లోనే ఉన్నాయని తెలిపారు, అనకాపల్లి ఎంపీగా ఎన్నికైన సీఎం రమేష్ పరిధిలోనే నాలుగు కర్మాగారాలుంటే వాటిల్లో మూడు మూత పడ్డాయని తెలిపారు ఎంపీ సిఎం రమేష్ మాటిమాటికి కొత్త పరిశ్రమలకు,ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నారు. దీనివల్ల వేలాది మందికి ఉపాది కలుగుతుందని ప్రకటించడం సంతోషమన్నారు. అయితే ఉన్న పరిశ్రమలను తెరిపించాలని కోరారు. మూతబడిన పరిశ్రమలను తెరిపించలేని స్థితిలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు, మూతబడిన చక్కెర కర్మాగారాలు పరిధిలో లక్షలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, ఆయా ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. చెరుకు రైతులు దిక్కుతోచని పరిస్థితిల్లో ఉన్నారని తెలిపారు, సంక్షోభంలో ఉన్న రైతు వ్యవ సాయకార్మికులను ఆదుకునే చర్యలు చేపట్టడం ద్వారా ఎంపీ సీఎం రమేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు.

ప్రాణాంతకమైన ఇథనాల్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామనడం ద్వారా అనకాపల్లి ప్రజలపై ఉన్నది అభిమానమా? దురాభిమానమా? చెప్పాలని ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లా లోని చక్కెర కర్మాగారాలు వినియోగంలోకి వేస్తే లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. సహకారరంగంలో పనిచేసే వీటిద్వారా లక్షలాది మంది గ్రామీణ ప్రాంత ప్రజలకు, వేలాది మంది యువకులకు ఉపాధి దొరుకుతుందన్నారు. అంతే కాకుండా దేశానికి చక్కెర దిగుమతులు బాధ లేకుండా పోతుందని, విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందన్నారు. ఖాయిలాపడ్డ పరిశ్రమలను ఆదుకున్నా రన్న మంచి పేరు కూడా ఎంపీకి దక్కుతుందని, ఆ దిశగా ఎంపీ రమేష్ చర్యలు చేపట్టి, సుగర్ ఫ్యాక్టరీలకు పూర్వవైభవం తీసుకురావాలని, ఎంపీ సిఎం రమేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని వెంకన్న కోరారు

తహశీల్దార్‌గా రమేష్ బాధ్యతల స్వీకరణ

తహశీల్దార్ రమేష్‌ను అభినందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం మండల తహశీల్దార్‌గా చావలి వెంకట రమేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహశీల్దార్‌గా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పనిచేసిన విజయభాస్కర్ విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లా గజపతినగరం నుంచి వెంకటరమేష్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు డిప్యూటీ తహశీల్దార్ సువర్ణ బాయి నేతృత్వంలో కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, మండలంలోని రెవెన్యూ సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ జగదీశ్వరరావు, విఆర్‌ఓ సాహితి, జూనియర్ అసిస్టెంట్ రోహిత్‌కుమార్, టైపిస్టు వంశీ, సచివాలయ, గ్రామ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సహాయక సిబ్బంది పాల్గొన్నారు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కల నాటివేత

అనకాపల్లి, చోడవరంలలో మొక్కలు నాటుతున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆదివారం స్థానిక జీవీఎంసీ గవరపాలెం హైస్కూల్(చిన్న హై స్కూల్)లో లయన్స్ క్లబ్ అనకాపల్లి ఆధ్వర్యంలో స్కూల్ ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పిళ్ల హరశ్రీనివాసరావు, కార్యదర్శి ఎం రాకేష్, కోశాధికారి వై. సత్యనారాయణ, బి వినోద్ కుమార్, విశ్రాంత అటవీ రేంజర్, బివి రమణ, జి ఎన్ వి డి రత్నాజీరావు, పి శివ వెంకటరావు, ఆర్ నారాయణ రావు, వై మహేంద్ర, కె నూకరాజు, వివిఎస్ శంకరరావు, విద్యాలయ ఎన్‌సిసి ఆఫీసర్ కె జనార్ధనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: చోడవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రేమసమాజంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే చర్యలు చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు గూనూరు పెదబాబు, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు

చెత్తమయంగా నర్సీపట్నం

- డంపింగ్ యార్డుల్లా వీధులు
- పట్టించుకోని అధికారులు
-ఇదీ పారిశుధ్య దుస్థితి

చింతపల్లి రహదారిలో పేరుకుపోయిన చెత్తా చెదారం

పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న చెత్త

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: పట్టణంలో పారిశుధ్యం నానాటికి దిగజారిపోతోంది. అసలే వర్షాలు కరుస్తున్నాయి. ఆపై పేరుకు పోయిన చెత్తతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని పలు వీధులు మురికివాడను తలపిస్తున్నాయి. పట్టణంలో చెత్త చెదారం పేరుకు పోవడంతో డెంగ్యూ, వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా చెత్త పేరుకు పోయింది. పక్కనే తాగు నీటి కొళాయి కూడా ఉంది. చింతపల్లి ప్రధాన రహదారిలోని ఏరియా ఆసుపత్రికి సమీపంలో చెత్త పేరుకుపోయింది. అలాగే కృష్ణదేవి పేటకు వెళ్లే ప్రధాన రహదారిలోని గంగరాజు మేడ వద్ద చెత్త పేరుకు పోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో చెత్త పేరుకు పోతున్నా అధికారులు అటువైపు చూడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లీజింగ్ వేసి ఆయా ప్రదేశాలను శుభ్రం చేయాలని కోరుతున్నారు. పందులు స్వైర విహారం చేస్తూ మురికి కూపాలను చల్లాచెదురుగా చేయడంతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడతావేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని పారిశుధ్యాన్ని మునిసిపల్ అధికారులు మెరుగుపరచాలని పట్టణ ప్రజల కోరుతున్నారు.



కెడి పేట మార్గంలో గంగరాజు మేడ వద్ద పందుల స్వైర విహారం

పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో సాలికమల్లవరం పంచాయతీలో సర్పంచ్ పెద్దిరెడ్డ నూకరత్నం ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య పనులు ప్రారంభించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామంలో పారిశుధ్య సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో ఎంపీడీవో ఆదేశాల మేరకు కాలవల పూడికతీత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పెదిరెడ్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా మరిణమ్మతల్లి పండగ

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని ఉపమాక, సీహెచ్ లక్ష్మీపురం గ్రామాల్లో ఆదివారం మరిణమ్మతల్లి పండుగ ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించు కున్నారు.సిహెచ్ లక్ష్మీపురంలో అన్న సమారాధన నిర్వహించారు. పండుగ సందర్భంగా అమ్మవారి ఆలయా నికి, అమ్మవారికి పుష్ప అలంకరణ చేసారు.గ్రామాల్లో పండుగ వాతావరణ నెలకొంది.

ఆటస్థలంలో పేరుకు పోయిన తుప్పలు

తుప్పలతో నిండిన ఆటస్థలం

-అవస్థలు పడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణ సువిశాలమైన ఆటస్థలం కావడంతో గ్రామస్తులు మాత్రమే కాకుండా మండల వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు ఈ ఆట స్థలంలో వివిధ ఆటల పోటీలు నిర్వహిస్తారు. సుమారు 8ఎకరాల ఆట స్థలం ఉండటంతో నిర్వహణ కాస్త ఇబ్బందికరంగా మారింది. ఈ ఆటస్థలం మైదానం ఫుట్ బాల్ , క్రికెట్ సహా, వివిధ ఆటల పోటీలు నిర్వహిస్తారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తుప్పలు పేరుకు పోయాయి. దీంతో, క్రీడా కారులు అసౌకర్యానికి గురవుతున్నారు.తుప్పలు పేరుకు పోవడంతో విష పురుగులు సంచరిండంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.తుప్పలు అధికంగా ఉండడంతో సమీపంలో కొందరు బహిర్భూమిగా వినియోగించడంతో దుర్గంధం వెదజల్లుతుంది అధికారులు స్పందించి ఉపాధి హామీ నిధులతో క్రీడా ప్రాంగణాన్ని బాగు చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రాజుబాబు ఆధ్వర్యంలో ఆదివారం 'చదవడం - మాకిష్టం ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు వీలైనప్పుడల్లా గ్రంథాలయాన్ని సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతున్న విద్యార్థులు

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కృష్ణారావు

అతివేగం ప్రమాదకరం

ప్రజాశక్తి-గొలుగొండ:వాహనాలపై అతివేగంగా వెళ్లడం, డ్రైవింగ్ సమయంలో వాహనదారులు హెల్మెట్ ధరించక పోవడం అత్యంత ప్రమాదకరమని గొలుగొండ ఎస్సై కృష్ణారావు తెలిపారు. మండలంలోని అయ్యన్నపాలెం జంక్షన్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు.వాహనదారులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. వాహనదారులు పరిమితమైన వేగంతో వాహనాలను నడపాలని ఆయన సూచించారు. వాహనదారుడు లైసెన్స్ తప్పక కలిగి ఉండాలని, సరియైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాన్ని నడపకూడదని ఆయన అన్నారు. నిదానంగా వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆద్యంతం ఆనందమయంగా..

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల వద్ద పూర్వ విద్యార్థుల ఆద్యంతం ఆనందదాయకంగా ఆదివారం సాగింది. 1964-69 మధ్య కాలంలో ఫస్ట్ ఫారం నుండి ఎస్ ఎస్ ఎల్సి వరకు చదువుకున్న ఆనాటి విద్యార్థులు నేటి వృద్ధుల సమావేశం ఆనాటి జ్ఞాపకాలను ఒక్కొక్కరు చెప్పుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. 78 వయసులో కూడా ఆనందాన్ని బాధను నెరవేసుకున్నారు. సమావేశం ఏర్పాటుకు ఎల్లపు వెంకటరమణ, శెట్టి సన్యాసిరావులు ఏడాదికాలంగా వారి చిరునామాలు సేకరించడం విశేషం. ఈ బ్యాచ్‌లో సుమారు 32 మంది మృతి చెందటంతో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఇటీవల పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి వారికి నగదు బహుమతి అందజేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

-సీతంపాలెంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -నక్కపల్లి:బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకునే వయసులోనే వివాహం చేసి చిన్నారుల జీవితాలను నాశనం చేస్తున్నారని తెలుగు ఉపాధ్యాయులు ఎన్ వి ఎస్ ఆచార్యులు ఆవేదన వ్యక్తం చేసారు. మండలంలోని సీతంపాలెం గ్రామంలో ఆదివారం ఆయన గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులతో కలిసి బాల్య వివాహాల నివారణ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ భర్త గొర్ల నాగ అప్పలరాజు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు ఎన్ వి ఎస్ ఆచార్యులు మాట్లాడారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు అబ్బాయిలకి వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు.ఆడపిల్లలను చదివించడం మనందరి బాధ్యత అన్నారు. చిన్న వయస్సులోనే పెళ్ళిళ్ళు చేస్తే అనారోగ్యం పాలవుతారని తెలిపారు. బాల్య వివాహాల పై తల్లిదండ్రుల్లో చైతన్యం నింపేందుకు కృషి చేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు ఎన్ వివిఎస్ ఆచార్యులుకు పలువురు అభినందనలు తెలిపారు .



అవగాహన కల్పిస్తున్న ఎన్‌విఎస్ ఆచార్యులు

నినాదాలు చేస్తున్న సిఐటియు నేత, కార్మికులు

పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుద్ధ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. నర్సీపట్నంలో సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్కూల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు అంతా మహిళలు, ఇందులో ఒంటరి మహిళలు కూడా ఎక్కువ మంది ఉన్నారన్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోతే కుటుంబం ఎలా పోషించుకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరారు. డ్రెస్సులు, గుర్తింపు కార్డు, బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం పథకం జిల్లా అధ్యక్షులు ప్రసన్న, మహిళా సంఘం నాయకులు ఎల్.గౌరీ పాల్గొన్నారు.

విదేశీ వైద్య విద్యపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించాలనుకునే ఔత్సాహిక విద్యార్థులకు ఈ - వింగ్స్ అబ్రాడ్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నగరంలోని ప్రముఖ హోటల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఎ.రామకృష్ణ, శ్రీధర్‌రావు మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏడాదీ మారుతూ వస్తున్న నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలను అనుసరించి వాటి ద్వారా ఏయే దేశాల్లో వైద్య విద్యను అభ్యసించేందుకు అనుకూల వాతావరణం ఉందో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. గతంలో ఫిలిపెన్స్‌లో ఎక్కువగా విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేవారని, అక్కడ నాలుగున్నర ఏళ్ళు మాత్రమే వైద్య విద్య అందుబాటులో ఉండటం, ఇది భారతదేశ వైద్య విద్య నియమావళికి అనుకూలంగా లేకపోవడంతో ఈ ఏడాది అక్కడకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు. కరిగిస్తాన్, కజికిస్తాన్లలో వైద్య విద్య ఉత్తమ ప్రమాణాలు కలిగి ఉందని తెలిపారు. తమ సంస్థ ద్వారా కరిగిస్తాన్, కజికిస్తాన్, సెంట్రల్ అమెరికా, జార్జియాలలో తొమ్మిది కళాశాలలకు అడ్మిషన్లు పొందవచ్చునని పేర్కొన్నారు. వివరాలకు 8806688068 నెంబరును సంప్రదించాలని సూచించారు.

'బాబు పాలన - రాష్ట్ర పురోగతి'పై సదస్సు

ప్రజాశక్తి-కలెక్టరేట్ : కూటమి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు పూర్తవుతున్న సందర్భంగా తెలుగు శక్తి ఆధ్వర్యంలో చంద్రబాబు పాలన - రాష్ట్ర పురోగతి అంశంపై ఆగస్టు 1న హోటల్ దసపల్లాలో ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్ తెలిపారు. ఆ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పివి.వసంతరావు, సిఎం.రమణ, బుచ్చ రామిరెడ్డి, భద్రరావు, ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు స్వస్తి చెప్పాలని నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 1219వ రోజుకు చేరాయి. దీక్షల్లో డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ, నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు భానోజీ బిల్లా, మీసాల సురేష్, వినీష్, ప్రసాద్, ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పుడు, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన గృహ నిర్మాణాలు

- గ్రామాలకు దూరంగా లేఅవుట్ల ఏర్పాటు
-పలుచోట్ల లబ్ధిదారులకు అందని బిల్లులు
- కూటమి ప్రభుత్వంపై అంతా ఆశలు

ప్రజాశక్తి-గొలుగొండ: గత ప్రభుత్వం నవరత్నాలలో భాగంగా పేదలకు మంజూరు చేసిన ఇళ్లలో ఇప్పటికి సగం కూడా పూర్తి కాలేదు. ఇంటికి 1.80 లక్షలు పూర్తి సబ్సీడితో ఇళ్ల నిర్మాణాలకు కేటాయించినా ఇళ్ళ నిర్మాణాలు చాలా చోట్ల పూర్తి కాలేదు. లేఅవుట్‌ల ఎంపిక విషయంలో అధికారులు ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను ఎంపిక చేయలేకపోవడం, ఎంపిక చేసిన స్థలాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం, నిర్మాణాన్ని పూర్తయిన నాటికి బిల్లులు చెల్లించక పోవడంతోనే నిలిచి పోయాయి.

మండలంలో 1,442 మంది లబ్ధిదారులకు ఇళ్ళు మంజూరయ్యాయి. అందులో ఇప్పటివరకు 618 ఇల్లు మాత్రమే పూర్తి చేశారు. 303 మంది లబ్ధిదారులు ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టలేదు. పునాదుల స్థాయిలో 282, లెంటల్ లెవెల్లో 10, రూఫ్ స్థాయిలో 117, స్లాబ్ పూర్తి చేసిన వాటిలో 112 ఇల్లు ఉన్నాయి. లేఅవుట్ల విషయానికొస్తే కొంగసింగి, లింగంపేట గ్రామాల్లో ఇళ్ళ నిర్మాణాలకు అనువుగా లేని చోట స్థలాలు కేటాయించడంతో లబ్ధిదారులు ఎవరూ ఇళ్ళ నిర్మాణానికి ఆసక్తి చూపలేదు. దీంతో ఆ రెండు గ్రామాల్లో ప్రభుత్వం లేఔట్లను రద్దు చేసింది. జోగంపేట, కొత్తఎల్లవరం గ్రామాలకు సంబంధించిన లేఅవుట్లు గ్రామానికి దూరంగా ఉండటంతో లబ్ధిదారులు అక్కడికి వెళ్లడం ఇష్టం లేక గ్రామాల్లో తమ సొంత స్థలాలలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.

పునాది దశలో నిలిచిన ఇళ్లు

మండలంలో కృష్ణదేవిపేటకు చెందిన లబ్ధిదారులు నేటికీ ఒక్కరు కూడా ఇళ్ళ నిర్మాణం ప్రారంభించ లేదు. నాగపురం లేఔట్‌లో ప్రభుత్వం చూపించిన స్థలంలో లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణానికి ముందుకు వచ్చి కొంతమంది పునాదుల వరకు నిర్మాణం చేపట్టారు. కాలనీకి వెళ్లే మార్గంలో చెరువు నుంచి వచ్చే కాలువపై వంతెన నిర్మించాల్సి ఉంది. దీని నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు కేటాయించింది. కానీ, పనులు ప్రారంభించలేదు. దీంతో, లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణం చేసి ఇబ్బంది పడటం ఎందుకని నిర్మాణాలను నిలిపి వేశారు.

నాగాపురంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి నిరుపయోగంగా ఉన్న లేఅవుట్

పప్పు శెట్టిపాలెం లేఅవుట్ అనుకూలంగా ఉండడంతో లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. ఇళ్ళ పూర్తి చేసిన కొంతమంది లబ్ధిదారులకు గత ప్రభుత్వంలోనే చెల్లింపులు అందక ఇళ్ళ నిర్మాణంపై మొగ్గు చూపలేదు. బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో నిర్మాణాలపై ఆసక్తిలేక వివిధ దశల వరకు నిర్మించి వదిలేశారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించిన ఇళ్ల నిర్మాణాల చెల్లింపులు కూడా ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు రావాల్సివుంది. గత నాలుగు నెలల నుంచి ఒక్క రూపాయి కూడా ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు చెల్లింపులు జరగలేదు.

గత ప్రభుత్వ కాలంలో కట్టుకున్న ఇళ్లకు కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందా? లేదా? అన్న భయం లబ్ధిదారుల్లో నెలకొంది. టిడిపి ప్రభుత్వ కాలంలో నిర్మించిన ఇళ్లకు వైసిపి ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడాన్ని గుర్తుచేసుకొని ఆందోళన చెందుతున్నారు. గృహ నిర్మాణ సంస్థ అధికారులు మాత్రం వివిధ ఇళ్ల పథకాల కింద నిర్మాణాలు చేపట్టిన ఇళ్లకు వాటి నిర్మాణ దశల ఆధారంగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని చెబుతున్నారు. గత ప్రభుత్వ కాలంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలపై అధికారులు నివేదిక తయారు చేసి సిద్ధం చేశారు. ప్రభుత్వల ఏ క్షణంలోనైనా ఇళ్ల నిర్మాణ సమాచారం పంపించాలని కోరినా, అందుకు తగిన సమాదానం ముందుగానే గృహ నిర్మాణ సంస్థ అధికారులు తయారుచేశారు. మండలంలో పలు గ్రామాల్లో లబ్ధిదారులు ఉన్నప్పటికీ స్థలాల కొరతతో వారికి ఇళ్ళు మంజూరు కాలేదు. మిగిలిన లబ్ధిదారులకి ప్రస్తుతం నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకి కూటమి ప్రభుత్వం ఎంతవరకు న్యాయం చేస్తుందో చూడాలి.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు మంచి నిర్ణయం

రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ పివి.రమేష్

మాట్లాడుతున్న పివి రమేష్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లోపభూయిష్టమైన, రైతుల పాలిట యమపాశంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను నూతన రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయటం సరైన నిర్ణయమని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి డాక్టర్ పివి.రమేష్ అన్నారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హోటల్ దసపల్లాలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివద్ధి - తక్షణ కర్తవ్యాలపై జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొని వచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రైతులలో గందరగోళ పరిస్థితి కల్పించిందని, భూ కబ్జాలు, ఆక్రమణలకు అవకాశం కల్పించిందని అన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వనరులను కోల్పోయిందన్నారు. ఎపిలో స్థానిక సంస్థలను బలోపేతం చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క శాతం ధనవంతుల చేతిలో 40 శాతం ఆస్తులు ఉన్నాయని, దిగువన ఉన్న 50 శాతం ప్రజల చేతుల్లో 14 శాతం ఆస్తులు మాత్రమే ఉన్నాయన్నాని తెలిపారు. ఇలాంటి అసమనాతలను తగ్గించడానికి ఆస్తులపై, సంపదలపై పన్నులు విధించి, సంక్షేమ కార్యక్రమాలను పేదలకు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో దూర విద్యా కేంద్రం పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.హరిప్రకాష్, పూర్వ వైస్ ఛాన్సలర్స్ ఆర్.సుదర్శన్ రావు, ఎస్.రామ కృష్ణారావు, ప్రొఫెసర్ అవధాని, ప్రొఫెసర్ మురళీకృష్ణ, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిల్లి పైడి రాజు, రామారావు, హనోక్, ప్రగడ వాసు ప్రసంగించారు.

వెంకటేశ్వర మెట్ట భూ సమస్యకు త్వరలో పరిష్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న అల్లిపురం వెంకటేశ్వర మెట్ట దేవాదాయ భూముల సమస్య అతి త్వరలోనే పరిష్కారం కానుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం టిడిపి పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, టిడిపి రాష్ట్ర బిసి గరవ సామాజిక వర్గం సాధికారక సమితి సభ్యురాలు తిరుమల దేవి చక్రవర్తి దంపతులు పల్లా స్వగృహంలో కలిసి 2002 నుంచి వెంకటేశ్వర మెట్ట భూముల వివాదంపై పోరాడిన వివరాలు, అధికారులతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలను వివరిస్తూ విజ్ఞాపనపత్రం సమర్పించారు. స్పందించిన పల్లా మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యపై విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ ప్రస్తావించారని, అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి చాంబర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే వంశీ, తాను దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో చర్చించినట్లు తెలిపారు. సమస్యను ఆరు నెలల్లో పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు వెల్లడించారు.

పల్లాకు వినతిపత్రం ఇస్తున్న డాక్టర్ చక్రవర్తి